# మా చెల్లాయత్త మొగుడు

**మా నాన్న పెద్దమ్మకూతురు కర్రి చెల్లాయమ్మ. ఆవిడ పెనిమిటిని మావయ్యాఅని పిలవాలి మేం.**

**కానీ,**

**మా అమ్మది చిత్రమైన తత్వం. మా చిన్నప్పుడు బలభద్రపురంలో ఉండే మాసొంత మావయ్య పడాలెంకన్న భార్యని అత్త అని పిలవాల్సింది పోయి మాయ్యపెళ్ళాం అని అలవాటు చేసింది. తెల్సీతెలియనివయసులో అలాగ పిలవడం మొదలెట్టిన మేం ఇప్పటికీ అలాగే పిలుస్తున్నాం. మా అక్క సత్యవతి భర్తని బావ అని పిలవాలి. కానీ, అక్కమొగుడు అని అలవాటు చేసింది మా అమ్మ. ఇంకా చిన్నాన్న పెళ్ళాం అని, గవరమ్మత్త తమ్ముడనీ, రాజమ్మ అల్లుడనీ, పిలిపించేది మాతో. ఆ విధంగా మేవంతా మావయ్య అని పిలవాల్సిన మా చెల్లాయత్త భర్తని మా అమ్మ కారణంగా మా చెల్లాయత్తమొగుడు అని పిలిచేవాళ్ళం.**

సన్నగా, రివటలా వుండి చాలా పొడుగ్గా వుండేవాడు మా చెల్లాయత్త మొగుడు. రకరకాల రంగుల కోడి ఈకల్తో కుచ్చుల టోపీలూ చేసేవాడు. తినిపారేసిన తాటి టెంకల్ని శుభ్రం చేసి దిష్టిబొమ్మల్ని తయారుచేసి వాళ్ళింటి ద్వారబంధానికి ఎడాపెడా తగిలించేవాడు. సోడా బిర్డాల్తో విష్ణుచక్రాలు, డాల్డా డబ్బాల్తో రైలుబళ్ళు, సత్తి సూర్నాణరెడ్డిగారి పొలంలో జెటార్ ట్రాక్టర్‌ని మొత్తం విప్పేసి ఆయిలింగ్ చేసి మళ్ళీ బిగించేసేడోసారి. గరికి పాటి చిట్టి గారింట్లో పాడయిపోయి మూలపడున్న గోడ గడియారం విప్పి పోగులు పెట్టి రెండో రోజు తళ తళలాడే కొత్త గడియారంలాగ చేసి చిట్టిగారి మండువా లోగిలి గోడకి తగిలించేడు. చింతా నర్సిరెడ్డిగారు ఇదిక పనికిరాదు పెంట మీద పారేద్దారి అనుకుంటున్న రేడియోని ఖంగుఖంగుమని మోగేలాగ బాగు చేసేసేడు.

ఎక్కడా చదువుకోకుండా ఏ విద్యా ఏ గురువు దగ్గరా నేర్చుకోకుండా ఇంత సందడి చేస్తున్న మాచెల్లాయత్త మొగుడ్ని చూడ్డానికి గోపుడితోటలోంచి ఇద్దరు కుర్రోళ్ళు వచ్చేవారు. వూళ్ళో స్కూలు బిల్డింగు ఎదురుగ్గా వంద అంటే వందే గజాలున్న ఖాళీ స్థలం కొని రెండంతస్తుల మేడ కట్టేడు. చాలా చిత్రమైన మేడది. పసలపూడొచ్చి చూడాలి తప్ప వర్ణించడం కుదరదు దానిగురించి.

గృహప్రవేశానికి ఊళ్ళో జనాన్నే గాకుండా ఎర్రమట్టి గోతుల దగ్గరుండే వాళ్ళనీ, కాకోరి సావరం వాళ్ళని, సర్వాయతోట వాళ్ళనీ, నరాలపాలెంలో ఉండే జనాల్ని అందర్నీ ఆదరంగా పిల్చేడు. కులం మతం అని చూడకుండా పిల్చిన మగానుబావుడనుకుంటా వచ్చిన ఆ జనాలకి ఎందుకూ పనికి రాని సరుకుల్తో రకరకాల వస్తువులు చేసి వాళ్ళందరికీ బహుమతులు కింద ఇచ్చేడు.

అలా ఇవ్వడమే గాకుండా ''ఈ ప్రెపంచంలో ఏ వస్తువూ పనికి రాకుండా పోదు. చూడండి ఇప్పుడు మీకందరికీ బహుమతిలిచ్చిన వస్తువుల్లాగ ఆ పనికి రావనుకుంటున్న సామాన్లతో ఎన్నో చెయ్యొచ్చు. కాబట్టి రేపట్నుంచి పనికి రావని బయటి పారేసిన వాటితో ఏవైనా చెయ్యడానికి ప్రయత్నం చెయ్యండి. ఏం చెయ్యాలో తొయ్యకపోతే ఆటిని నా దగ్గరకి పట్రండి'' అన్నాడు.

* * *


రామచంద్రపురంచర్చిలో పెద్ద పాస్టరు కృపానందంగారి మనవరాలికి నామకరణం అయితే ఇంటికొచ్చి మరీ పిలిచేరు మా చెల్లాయత్తని. వాళ్ళకేవన్నా పట్టుకెళదారంటే మంగళారం రామచంద్రపురంలో కొట్లన్నీ కట్టేసేరు. ఎలాగా అని కంగారు పడిన మా చెల్లాయత్త


మొగుడుకి చెపితే నవ్వేసిన ఆయనగారు మధ్యాన్నం అట్టు వేసుకుని తిని పారేసిన కోడిగుడ్డు డొల్లల్ని పెంట మీంచి ఏరుకొచ్చి వా శుభ్రం చేసి డొల్లల పైన రంగులేసి లోపల జీరోవోల్టు బల్బులు పెట్టి చిన్న చెక్క స్టేండుకి తగిలించి టేబుల్ లేంప్ కింద చేసిచ్చేడు.

ఫంక్షనుకొచ్చిన వాళ్ళందరూ ఇచ్చిన కానుకలకంటే మాచెల్లాయత్త పట్టుకెళ్ళిన టేబుల్ లేంప్ చాలా బాగుందని తెగ మెచ్చుకున్నా కృపానందంగారింట్లో వాళ్ళంతా. మర్నాడు పసలపూడొచ్చేసి మా చెల్లాయత్త మొగుడ్ని తెగ పొగిడేసి రాత్రి భోజనాలకి పిలిచేరు.

ఆవేళ పౌర్ణమి. మంచు చక్కగా పడ్తుంది. పాస్టరు గారింటి వాకిట్లో ఏర్పాటు చేసేరు భోజనాలు. మొత్తం అయ్యేకా దొడ్లో మూలపడు పాతకాలం కారు కళ్ళ పడేసరికి పరిగెట్టుకుంటా వెళ్ళేడు పొడుగ్గా ఉండే మా చెల్లాయత్తమొగుడు.

అతని వెనకే వెళ్ళిన కృపానందంగారు ''ఇది కారు పుట్టిన మొదట్లో కారు... జార్జి దొరగారు లండన్ నించి తెప్పించేరు. ఆయ మాతాతగారికి మంచి దోస్తు. నలభై ఏడు తర్వాత వాళ్ళ దేశం వెళ్ళిపోతా దీన్ని మాకు బహుమతిగా ఇచ్చేసేరు చాన్నాళ్ళు పనిచేసి ము పడిపోయిందండి'' అన్నాడు.





ఆ బండినే తడుముతా చూసిన మా చెల్లాయత్త మొగుడు ''ఈ బండి నాకు కావాలి అమ్ముతార్రా?'' అనడిగేడు.

''ఈ డొక్కుని మీరేం చేసుకుంటారండిబాబూ!'' అన్నారు పాస్టరుగారు.

''ఏదో చేసుకుంటాను నా కమ్ముతానంటే చెప్పండి'' అన్నాడు.

''దీన్ని అమ్మడమేంటండీ పుట్టినే పట్టుకెళ్ళిపోండి'' అన్నాడు పాస్టరు కృపానందంగారు.

* * *

అమావాస్య అర్ధరాత్రి కోర్రావులు బస్సులో దిగిన మా చెల్లాయత్త మొగుడు కొన్ని ఇనపసామాన్ల కాలవకాడుండే చంటి రిక్షాలో వేసుకునొచ్చేడు. వాటిని చూసిన మా చెల్లాయత్త... ''శనివారం పూట ఏంటీ ఇనపసామాన్లు?'' అనడిగింది.

నవ్వేసిన మా చెల్లాయత్తమొగుడు. ''ఈటిని ఇనపసామాన్లు అని తీసి పారెయ్యకు..చిన్నకారుకి సంబంధించిన కొన్ని పార్టులు'' అన్నాడు. ''ఈటినీవేళప్పుడు ఎందుకు కొనుక్కొచ్చినట్టు?'' అడిగింది మా చెల్లాయత్త. ''పాస్టరు గారింట్లోంచి తెచ్చిన కారు ఇంజనుపార్టులు. ఇవేళ రెండు దొరికినియ్యి కాకినాట్లో. మొత్తంగానీ దొరికితే ఫస్టుక్లాసైన కారు తయారవ్వుద్ది మన చేతుల్లో'' అన్నాడు.

''ఎనకటికెవడో తర్వాత గుర్రం కొందారని ముందరనాడా కొన్నాడట అలాగుంది మీ వరస''అంది మా చెల్లాయత్త.

నవ్వేసిన మా చెల్లాయత్తమొగుడు ''ఆ కొన్నోడితో నన్ను పోల్చకండా అన్నం పెట్టు ముందర'' అన్నాడు.

''ముందర నూతి దగ్గరకెళ్ళి పొళ్ళు లేకండా కాళ్ళు కడుక్కు రండి'' అనేసి వండిన గిన్నెలు తేవడానికి వంటపాకలో కెళ్ళింది.

* * *

తాగుడుకి బాగా అలవాటు పడిపోయి చివరకి ఎక్కడ అప్పుపుడద్దా అని చూసే దశ కొచ్చేసిన మా నాన్న మా చెల్లాయత్త మొగుడు దగ్గర కెళ్ళి ఎదురుగుండా బాసిపీట వేసుక్కూర్చుని ఎక్కడ సందు దొరుకుద్దా ఎక్కడ రెండ్రూపాయలు అప్పు అడుగుదావా అని చూస్తున్నాడు. పాడైపోయిన లక్కగ్రామఫోను రికార్డుతో యాష్ట్రే తయారుచెయ్యడంలో లీనమైపోయిఉన్న మాచెల్లాయత్తమొగుడు అసలు మాటాడ్డానికి సందివ్వడంలేదు మానాన్నకి. చలిపొద్దు దాటింది. రామచంద్రపురంలో దస్తావేజులు రాసే తాడి సూరెడ్డిగారు పెద్ద (రిక్షావాడి పేరు) రిక్షాలో వెళ్తుంటే ఆపిన మా చెల్లాయత్తమొగుడు ఆయన్ని లోపలికి తీసుకొచ్చి కంచుగ్లాసుడు బెల్లం టీ పట్టుకొచ్చి ఇస్తుంటే ''ఇప్పుడే ఇంట్లో అన్నం తిని బయల్దేరేను'' అన్నాడు తాడిసూరెడ్డిగారు.

''పర్లేదు..తోళుం పుచ్చుకోండి బాయ్యా'' అని లోపలికెళ్ళి చిన్న కాయితం పొట్లం పట్టుకొచ్చి సూరెడ్డిగారి కిచ్చేడు.

దాన్ని అందుకుంటా ''ఏంటిది దేవుడి వీభూది పొట్లమా ఇంత చిన్నదుంది?'' అనుకుంటా పొట్లం విప్పి అందులో ఉన్నది చూసేకా ''ఆహోహో... హోహో... హో'' అనరుస్తుంటే ఏవయిందా పెద్ద మనిషికి తేలుకుట్టిందా, పాముగానీ కరిచిందా అనుకుంటా లోపల్నుంచి పరిగెత్తుకొచ్చింది మా చెల్లాయత్త. ఎప్పుడూ మాటాడని సూర్రెడ్డిగారు అసలు పుట్టేకా అలాగెప్పుడూ అరవని సూర్రెడ్డిగారు కూస్త స్థిమితపడ్డాకా చెపితే తెలిసింది. ఆ పొట్లంలో ఉన్నదేంటంటే- మనిషి చిటికెనవేలుగోరుతో తయారు చేసిన పాళీ.

''రాంపురం గవర్నమెంటు హాస్పిటలు ముందున్న మీ కొట్లో పొద్దుట్నుంచి రాత్రిదాకా దించిన తల ఎత్తకుండా, పట్టుకున్న పెన్ను పక్క నెట్టకుండా రాస్తానే ఉంటారు గదా బాయ్యా మీకేవన్నా పనికొస్తదేమో అని ఏణ్ణర్ధం పాటు నా ఎడం చేతి చిటికెన వేలుగోరు పెంచి వారం క్రితమే దాన్ని గిల్లి మీ కోసం చేసేసీ పాళీ'' అన్నాడు. అత్తారబతంగా ఆ పాళీ అందుకున్న తాడి సూర్రెడ్డిగార్ని ''సూర్రెడ్డిబాయ్యా! ..అని మొదలెట్టి తన దగ్గరున్న రెండు ఆస్టిన్‌కారు పార్టులు గురించి చెప్పి తక్కినియ్యి ఎక్కడ దొరుకుతయ్యంటావ్?'' అనడిగేడు.



వంశీ పసలపూడి కథలు-72

"కాలవకాడుండే బడుగు సూర్నాణ్ణి అడిగిచూద్దాం" అన్నాడు తాడి సూర్రెడ్డిగారు. బడుగు సూర్నాణగారికి రాజమండ్రీ పాతకార్లకి సంబంధించిన మనుషులు బాగా తెల్సు. ఓరోజు పని గట్టుకు మరీ సూర్నాణతో పాటు రాజమండ్రీ వెళ్ళిన మా చెల్లాయత్తమొగుడు మరికొన్ని పార్టులు కొనుక్కొచ్చేడు.

* * *

పాత స్కూలు బిల్డింగెనకాల సపోటా చెట్టు మీద పిచ్చిక ఒకో గడ్డిపూచా ఏరుకు తెచ్చుకుని గూడు అల్లుకున్నట్టు అక్కడో పార్టూ అక్కడో పార్టూ సంపాయించి చిన్నకారు తయారు చేసేసుకున్నాడు మొత్తానికి. ఒకరోజు డిగ్ డిగ్ మని చప్పుడు చేస్తున్న ఆ చిన్నకారుని నడుపుకుంటా వస్తుంటే ఊరి జనమంతా విరగబడి చూశారు.

మాకు దగ్గర్లో వున్న రామచంద్రపురం వరకూ వెళ్ళి వచ్చేవాడు సరదాగా, చిత్ర విచిత్రమైన పనులు మాత్రమే చేసేవాడు చాలా సందడి సందడి చేసేవాడు మా చెల్లాయత్తమొగుడు. కొన్నాళ్ళ తర్వాత రోడ్డు కాంట్రాక్టులు చేయడానికని సీలేరు వెళ్ళిన మా చెల్లాయత్త మొగుడు తను తయారు చేసుకున్న కారు మీదే. నెలకీ రెండు నెల్లకీ దిగేవాడు ఊళ్ళోకి.

అడవుల్లోపల నలభై ఏళ్ళ వయసున్న బాగా ముదర వెదురు చెట్లు కనిపించాయట వాటిని నరికించి యానాం దగ్గరున్న నీలపల్లి వడ్రంగి మేస్త్రుల్ని తీసుకెళ్ళి చిత్రమైన మంచాలు తయారు చేయించి తను తయారు చేసుకున్న కారు వెనకాల పెట్టించి తనకి కాంట్రాక్టు బిల్లులు పాస్ చేయించిన ఆఫీసరు దొరగారికి కానుకగా ఇచ్చేట. అలాగే ముదిరిన పనసకర్రతో పగలు సోఫాసెట్టు రాత్రి మంచంలా మలుచుకునే పర్నీచరు చేయించి అదే కారులో పట్టుకెళ్ళి ఇంకో ఆఫీసరు దొరగారికి చేయించి బహుమతి కింద ఇచ్చేట.

ఒకసారి ఫారెస్టు బంగళాలో కుటుంబంతో పాటు బసచేసిన మినిస్టరుగారు మా చెల్లాయత్త మొగుడి చిత్రమైన కారు చూసి "అది నాక్కావాలి" అన్నారట. చచ్చినా ఇవ్వనన్నాడట. "కొత్తకారు కొనిస్తాను ఈ ఏంటిక్ కారు మా కిచ్చెయ్యండి" అన్నాడట మినిస్టరుగారు.

ప్రేణం పోయినా ఇవ్వనని మా చెల్లాయత్తమొగుడు అనేసరికి పెద్ద గొడవైందట. కోపంతో రెచ్చిపోయిన మినిస్టరుగారు ఆ అడివి దారిలో మా చెల్లాయత్తమొగుడు చేస్తున్న కాంట్రాక్టులన్నీ ఆపించేసేడట. బిల్లులు పాసవ్వకుండా కిరికిర్లు పెట్టేడట.

ఆడేం చేసినా నా కారివ్వనని శపథం చేసి పసలపూడొచ్చేసేడు రివటలాగ సన్నగా పొడుగ్గా ఉండే మా చెల్లాయత్తమొగుడు.

* * *

నల్లటిమబ్బుల్ని కప్పుకుని కురవడానికి సిద్ధంగా వున్న మా వూరి ఆకాశం చాలా గుంభనంగా వుంది. కాకినాడ ధర్మాసుపత్రిలో చచ్చిపోయేడట మా చెల్లాయత్త మొగుడు. శవాన్ని కార్లో వేసుకుని తీసుకొస్తున్నారట.

కాస్సేపయ్యేక మా చెల్లాయత్తమొగుడు సొంతంగా తయారుచేసుకున్న కారు వాళ్ళ మేడ ముందాగింది. జనం పోగయ్యారు.

డిక్కీ ఓపెన్ చేసి శవాన్ని తియ్యడానికి బదులు చింతపండు బుట్టలాంటి ఒక పెద్ద తాటాకు బుట్టని తీసేరు.

ఇదేంటా అని చిత్రంగా చూసిన జనానికి వివరంగా చెప్పిందేంటంటే ———

బాగా పొడుగవ్వడం వల్ల శవం కారు డిక్కీలో పట్టక ఆ శవాన్ని నడుందాకా విరిచేసి మడతెట్టి తాటాకు చాపలో చుట్టేరంట. కాళ్ళూ చేతులూ కూడా పొయ్యిలో పెట్టేముందు పుల్లల్లాగ విరిచేసేరంట.

ఆరకంగా బతుకు పొడుక్కీ ఎన్నో చిత్ర విచిత్రాలు చేసిన మా చెల్లాయత్తమొగుడు చిట్ట చివరిసీను కూడా అలాగ చిత్రంగా జరిగింది.

* * *

వంశీ మా పసలపూడి కథలు-72